చదువు

ఈనాడు హైదరాబాద్ 10
మంగళవారం మే 22, 2018 ■ e-mail: edc@eenadu.in

సివిల్ సర్వీసెస్ ప్రక్రియలో మొదటిదైన ప్రాథమిక (ప్రిలిమినరీ) పరీక్ష జూన్ 3న జరగబోతోంది. గత పదేళ్ళలో అతితక్కువ ఖాళీలూ (సుమారు 782), పెరిగిన పోటీ (5 లక్షలమంది) మధ్య నిర్వహించే ఈ పరీక్షలో నెగ్గి మెయిన్స్‌కు అర్హత సాధించే 10,000 మందిలో నిలవటం అభ్యర్థుల లక్ష్యం. దీని కోసం ఇప్పటివరకూ సాగించిన సన్నద్ధతకు పునశ్చరణ, ప్రాక్టీస్ టెస్టులతో తుది మెరుగులు దిద్దుకోవాలి. అందుకు ఉపకరించే సూచనలు ఇవిగో!

తొలి దశకు తుది మెరుగులు!

ప్రిలిమ్స్ సిలబస్ లోతుగా ఉండదు. సాధారణ స్థాయిలోనే (జనరల్) ఉంటుంది. కానీ సిలబస్ ఎంత విస్తృతంగా ఉంటుందంటే.. ఏ అంశంమీదనైనా ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది. అందుకని గత కొద్ది సంవత్సరాల్లో ఏ విభాగం నుంచి ఎన్ని ప్రశ్నలు వచ్చాయో విశ్లేషించుకుంటే దేనికెంత ప్రాధాన్యం ఇవ్వాలో స్థూలంగా స్పష్టత వస్తుంది.

ప్రిలిమినరీలోని రెండు పేపర్లలో (జనరల్ స్టడీస్ పేపర్-1, జనరల్ స్టడీస్ పేపర్-2) ప్రతి పేపరుకూ 200 మార్కుల చొప్పున ఉంటాయి. పేపర్-1లో 100 ప్రశ్నలు. ప్రతి సరైన జవాబుకూ రెండు మార్కులు. పేపర్-2లో 80 ప్రశ్నలు. సరైన సమాధానానికి రెండున్నర మార్కులు. ప్రతి తప్పు జవాబుకూ 0.33 మార్కును తగ్గిస్తారు.

వి. గోపాలకృష్ణ
డైరెక్టర్, బ్రెయిన్ ట్రీ

పేపర్-2 క్వాలిఫైయింగ్ స్వభావమున్న పేపర్. దీనిలో అర్హత (67 మార్కులు) సాధిస్తేనే పేపర్-1ను మూల్యాంకనం చేస్తారు.

గత ఏడాది మాదిరే ప్రశ్నపత్రం ఉంటుందా అని చాలామంది అభ్యర్థులు అడుగుతుంటారు. ప్రతి సంవత్సరమూ ఒకే రకమైన ప్రశ్నల తీరూ, మార్కుల విభజనా ఎప్పటికీ ఉండదు. సివిల్స్ ప్రశ్నపత్రం చల నశీలమైనది, తప్పకుండా మార్పులుంటాయని గ్రహించాలి.

ఇటీవలి కాలంలో ప్రభుత్వ పథకాలకు ప్రశ్నపత్రంలో అధిక ప్రాధాన్యం లభిస్తోంది. ఈసారి కూడా ఆ అవకాశాలు ఎక్కువే. ఎందుకంటే... తమ కార్యక్రమాలూ, విధాన నిర్ణయాలను దేశవ్యాప్తంగా ఉన్న యువత తెలుసుకోవాలని ప్రభుత్వం భావిస్తుంది. దాంతో సివిల్స్, గ్రూప్స్ లాంటి పోటీపరీక్షల్లో వాటికి ప్రాధాన్యం తగినంతగా లభిస్తోంది.

పరీక్ష రాయాలా? వద్దా?

■ కొన్ని మోడల్ పేపర్లు రాసి చూసుకున్నపుడు నా స్కోర్లు చాలా తక్కువగా వచ్చాయి. ఇప్పుడు పరీక్ష రాస్తే ఒక అటెమ్ప్టును వృథా చేసుకున్నట్టవుతుందని అనిపిస్తోంది. ఏం చేయాలి?

మరీ తక్కువ మార్కులు వస్తే తప్ప పరీక్షకు హాజరవటమే మంచిది. పరీక్షపై గౌరవం ఉంచి, శక్తివంచన లేకుండా చిత్తశుద్ధితో కష్టపడి సిద్ధమైతే పరీక్ష రాయటమే సమంజసం. సివిల్స్ లాంటి పోటీపరీక్షలు ఈత నేర్చుకోవటం లాంటివి. కొలనులోకి దిగనంతవరకూ ఈత నేర్చుకోవటం సాధ్యమే కాదు!

■ ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచి ప్రశ్నలు రావట కదా? మరి అవి చదవటం వృథాయేనా?

ఇలాంటి అపోహలతో ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను నిర్లక్ష్యం చేయటం ఎప్పుడూ సరికాదు. అవి వివిధ సబ్జెక్టుల్లో అభ్యర్థులకు పునాదిని ఏర్పరుస్తాయి. 'కోర్'ను అవగాహన చేసుకుంటేనే వర్తమాన అంశాలు బోధపడతాయి. అయితే సివిల్స్ ప్రిలిమినరీ దగ్గరపడిన ఈ తుది ఘట్టంలో కరంట్ అఫైర్స్ మీద దృష్టి చాలా అవసరం.

■ వివిధ విభాగాల ప్రాధాన్యం విషయంలో పూర్వపు పరీక్షల నుంచి ఏం నేర్చుకోవాలి?

ఈ ప్రాధాన్యం ఎప్పుడూ స్థిరంగా ఉండదు. ఉదాహరణకు... వర్తమాన అంశాల నుంచి 2015లో 15 ప్రశ్నలే వచ్చాయి. ఇక 2012, 13 లలో అయితే చాలా తక్కువ ప్రశ్నలే అడిగారు. కానీ 2016లో వాటి సంఖ్య అనూహ్యంగా 42కు పెరిగింది. ఇక 2017లో వర్తమాన అంశాలపై ప్రశ్నలు 32కు తగ్గాయి. దీన్నిబట్టి చూస్తే... భవిష్యత్తులోనూ కరంట్ అఫైర్స్‌కు ప్రాధాన్యం ఉంటుందని నిశ్చయంగా చెప్పవచ్చు.

ప్రామాణిక సమాచారం

ఒకే సమాధానం, ఒక్కటే అన్వయం ఉండే ప్రశ్నలను మాత్రమే ప్రిలిమ్స్‌లో అడుగుతారు. అబ్జెక్టివ్ పేపర్ కాబట్టి వాస్తవ ఆధారితమైన ప్రశ్నలు మాత్రమే వస్తాయి. ఆ వాస్తవాంశాలను అధికారిక, ప్రామాణిక పుస్తకాల నుంచే గ్రహిస్తారు. అందుకే అభ్యర్థులు మార్కెట్లో దొరికే ప్రైవేటు ప్రచురణల కంటే ప్రభుత్వం ప్రచురించే ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలకూ, ప్రభుత్వ వెబ్‌సైట్లకూ ప్రాధాన్యం ఇవ్వాల్సివుంటుంది.

ప్రతి సబ్జెక్టులోనూ వర్తమాన అంశాలపై శ్రద్ధ పెట్టాలి. వీటి నుంచి ఎక్కువ సంఖ్యలో ప్రశ్నలు వస్తాయి కాబట్టి వాటిపై శ్రద్ధ వహించటం అవసరం. ఆ వర్తమాన అంశాల్లో కూడా ప్రభుత్వ పథకాలూ, కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలి.

ప్రిలిమినరీలో అభ్యర్థిని ఎంపిక చేయటం కంటే అనర్హులను తొలగించటమే ఎగ్జామినర్ల ఉద్దేశం. అందుకే ఒక అంశానికి సంబంధించి లోతుగా పరిశీలన చేసి, అందులోని వివిధ కోణాలను అర్థం చేసుకోవాలి. అందుకోసం వివిధ సబ్జెక్టుల్లోని విషయాలకు తాజా వర్తమాన అంశాలతో అనుసంధానం చేయాలి. ఈ రకంగా ఒక అంశానికి సంబంధించిన వివిధ పార్శ్వాలపై అవగాహన లభిస్తుంది. అది ప్రిలిమ్స్‌కే కాకుండా, మెయిన్స్‌కు కూడా ఉపయోగం.

ధీమాగా రాయండి..

సివిల్స్ లాంటి పోటీపరీక్షలు సాపేక్ష (రెలెటివ్) ప్రతిభను పరీక్షిస్తాయి. పేపర్ కష్టంగా ఉంటే అర్హత మార్కులు తగ్గిపోతాయి. సులభంగా ఉంటే ఆ మార్కులు పెరుగుతాయి. అందుకే సరిగా రాయలేదనుకున్న సందర్భాల్లోనూ పాసవుతుంటారు. 'పేపర్ సులువుగా ఉంది, బాగా రాశాం' అనుకున్నపుడూ ఫెయిలవుతున్న సందర్భాలున్నాయి.

అర్హత కోసం నిర్దేశించిన రెండో పేపర్‌ను విజయవంతంగా రాయటానికి నమ్మకం అవసరం. అనవసరంగా డీలాపడకూడదు. సోషల్ సైన్స్, ఆర్ట్స్ నేపథ్యమున్నవారు ఈ పేపర్‌ను కష్టంగా భావిస్తుంటారు. వీరు కాంప్రహెన్షన్‌ను మొదట పూర్తి చేయాలి. ప్రశ్నలను చదివాకే ప్యాసేజ్‌ను చదవటం వల్ల జవాబులు గుర్తించటానికి సమయం ఆదా అవుతుంది. తర్వాత గణిత సంబంధమున్న ప్రశ్నల సంగతి చూడటం మేలు.

జనరల్ స్టడీస్‌ను నూరుశాతం ఎవరూ పూర్తిగా రాయలేరు. ఆబ్జెక్టివ్ టెస్టు కాబట్టి తెలిసిన ప్రశ్నలకు తొలి రౌండులో జవాబులు గుర్తించాలి. తర్వాత రౌండులో ఇంటెలిజెంట్ గెస్ చేయవచ్చు. నెగిటివ్ మార్కులున్నాయని గుర్తుంచుకుని, జాగ్రత్త వహించాలి. ప్రిలిమినరీ ప్రధానంగా పరిజ్ఞానాన్నీ, సమాచారాన్నీ పరీక్షిస్తుంది. ప్రాక్టీస్ టెస్టుల వల్ల స్పష్టత వస్తుంది. ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో పరీక్షకు వెళ్ళటం ముఖ్యం.

- ఆర్.సి. రెడ్డి, డైరెక్టర్, ఆర్‌సీరెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్

పరిజ్ఞానం తాజాగా ఉండాలి

సివిల్స్‌లో విజయం సాధించాలంటే.. తాజా సంఘటనలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం, ఇటీవలి చర్చ నీయాంశాలపై లోతైన పరిజ్ఞానం పెంచుకోవడం అవసరం. వీటితోపాటు నిరంతర సాధన చాలా ముఖ్యం. అధ్యయనం కూడా ప్రధానమే. దానికంటే మించి పునశ్చరణకు ప్రాముఖ్యం ఉంది. కొత్తవాటి జోలికి పోకుండా ఇప్పటికే చదివిన అంశాలపై మరింత దృష్టిసారించాలి. పట్టు పెంచుకోవాలి.

వార్తాపత్రికలు చదవటం, మాక్ టెస్టులకు హాజరవటం తప్పనిసరి. సివిల్స్‌కు ఉపయోగపడే సమాచారంతో ఎన్నో వెబ్‌సైట్లున్నాయి. ఆన్‌లైన్ మాక్ టెస్టుల్లో జవాబులు కూడా ఉంటాయి కాబట్టి అవి అభ్యర్థుల కెంతో ఉపయోగం. ఒత్తిడికి గురి కాకుండా సహనం, ఏకాగ్రతలతో అధ్యయనం చేస్తే అనుకూల ఫలితం తప్పకుండా వస్తుంది.

- దురిశెట్టి అనుదీప్ *(సివిల్స్-2017 ఆలిండియా ప్రథమ ర్యాంకర్)*

ఈ మూడూ ఎంతో ముఖ్యం

సివిల్స్‌లో కష్టతరమైన దశ ప్రిలిమ్సే. దీనిలో నెగ్గటానికి దృష్టిపెట్టాల్సినవి- వర్తమాన అంశాలు, సబ్జెక్టు పుస్తకాలు, పరీక్షల సాధన. గత కొద్ది సంవత్సరాల్లో కరంట్ అఫైర్స్‌కు ప్రాధాన్యం పెరిగింది కాబట్టి వార్తాపత్రికలూ, సంబంధిత మ్యాగజీన్లూ చదవటం ముఖ్యం. అవగాహన చేసుకున్న సబ్జెక్టులను ఈ దశలో సమగ్రంగా పునశ్చరణ చేసుకోవాలి. అభ్యర్థులందరూ దాదాపు ఒకే రకమైన పుస్తకాలు చదివినా కొందరే ముందుండటానికి కారణం... ప్రాక్టీస్ టెస్టుల మూలంగా లభించే మొగ్గ. దీన్ని విస్మరించకూడదు.

ఇప్పుడు మిగిలిన రెండు వారాల్లో పాలిటీ, మోడర్న్ హిస్టరీ, ప్రభుత్వ పథకాలపై దృష్టి కేంద్రీకరించాలి. నవంబరు 2017 నుంచి ఇప్పటివరకూ వర్తమాన అంశాలను పునశ్చరణ చేసుకోవాలి. కొత్త పుస్తకాలేమీ చదవకూడదు.

రోజులో సుదీర్ఘకాలం అంటే 16 గంటల చొప్పున చదవాలని ప్రయత్నించకూడదు. అది ఆరోగ్యానికి నష్టం. ప్రతిరోజూ అరగంటసేపు నడవటం కానీ, బ్యాడ్మింటన్ లాంటి ఆటలు కాసేపు ఆడటం గానీ చేయటం మంచిది. తగినంత నిద్రపోవటం చాలా అవసరం. ఫలితాల గురించి అనవసరంగా ఆందోళన పడటం వల్ల మన సామర్థ్యం తగ్గుతుంది. ఆశావహంగా పరీక్షకు సిద్ధమైతే అనుకూల ఫలితం వచ్చే అవకాశాలే ఎక్కువ!

- కె. శ్రీహర్ష *(సివిల్స్-2017 విజేత)*

నోటీస్ బోర్డు

ప్రవేశాలు

ఐఐఎస్‌ఈఆర్‌లలో డ్యూయల్ డిగ్రీ

దేశవ్యాప్తంగా ఉన్న 7 ఐఐఎస్‌ఈఆర్ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్)లలో బీఎస్-ఎంఎస్ డ్యూయల్ డిగ్రీ ప్రవేశాలు. **కాలవ్యవధి:** 5 సంవత్సరాలు

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్ ఉత్తీర్ణత.

ఎంపిక: 1) కిశోర్ వైజ్ఞానిక ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై) ఫెలోషిప్‌కు ఎంపికైనవారు.

2) ఐఐటీ-జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మొదటి 10,000 లోపు ర్యాంకు సాధించిన అభ్యర్థులు.

3) స్టేట్ అండ్ సెంట్రల్ బోర్డు (ఎస్‌సీబీ) ఇంటర్ పరీక్షల్లో నిర్దేశించిన కటాఫ్ మార్కుల కంటే ఎక్కువ పొందినవారు.

రాతపరీక్ష: ఎస్‌సీబీ విధానంలో ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులు రాతపరీక్ష (ఐఐఎస్‌ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్)లో ఉత్తీర్ణులు కావాలి.

ఆప్టిట్యూడ్ టెస్ట్ తేదీ: 24.06.2018
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
చివరి తేదీ: 21.06.2018
https://www.iiseradmission.in/

లేడీ హార్డింజ్ మెడికల్ కాలేజ్, న్యూదిల్లీ

కోర్సు: బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్ **సీట్ల సంఖ్య:** 50 **అర్హత:** ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణత. మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు. **వయసు:** కనీసం 17 ఏళ్లు నిండి ఉండాలి. **ఎంపిక:** ప్రవేశపరీక్ష ద్వారా. **పరీక్ష తేదీ:** 24.06.2018 **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ **దరఖాస్తు ఫీజు:** రూ.550 **చివరి తేదీ:** 31.05.2018 **వెబ్‌సైట్:** http://lhmc-hosp.gov.in/

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

ఐకార్-ఐఐఆర్ఆర్, హైదరాబాద్

పోస్టులు: ప్రాజెక్ట్ పర్సనల్ (తాత్కాలిక ప్రాతిపదికన) **విభాగాల వారీ ఖాళీలు:** ఎస్ఆర్ఎఫ్-04, జేఆర్ఎఫ్-01, యంగ్ ప్రొఫెషనల్-01, టెక్నికల్ అసిస్టెంట్-10, స్కిల్డ్ హెల్పర్/ ఫీల్డ్/ ల్యాబ్ అసిస్టెంట్-02 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, డిప్లొమా, ఎంఎస్సీ, ఎంసీఏ, పీహెచ్‌డీ, నెట్/ గేట్. **వయసు:** యంగ్ ప్రొఫెషనల్ పోస్టులకు 21-45 ఏళ్లు, మిగిలినవాటికి 35 ఏళ్లు మించకూడదు. **ఇంటర్వ్యూ తేదీ:** 2018 జూన్ 11 నుంచి 14 వరకు. **వేదిక:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రిసెర్చ్, రాజేంద్రనగర్, హైదరాబాద్. **వెబ్‌సైట్:** http://www.icar-iirr.org/

నిట్, తిరుచిరాపల్లిలో ట్రైనీలు

సంస్థ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్), తిరుచిరాపల్లి, తమిళనాడు. **పోస్టులు:** డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంటెంట్. **ఖాళీలు:** 17

అర్హత: బ్యాచిలర్స్ డిగ్రీ, బీకాం, కంప్యూటర్ పరిజ్ఞానం.

వయసు: 40 ఏళ్ల మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా. **ఎంపిక తేదీ:** 31.05.2018. **వేదిక:** ది ఓరియన్ బిల్డింగ్, ఎన్ఐటీ, తిరుచిరాపల్లి. **వెబ్‌సైట్:** https://www.nitt.edu/

నిట్, కురుక్షేత్రలో జేఆర్ఎఫ్ ఖాళీలు

ఫెలోషిప్స్

సంస్థ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), కురుక్షేత్ర, హరియాణ. **పోస్టు:** జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్) **ఖాళీలు:** 05 **అర్హత:** సంబంధిత సబ్జెక్టులు/ బ్రాంచుల్లో బీఈ, బీటెక్, ఎంటెక్, ఎంఎస్సీ, నెట్/ గేట్.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ **చివరి తేదీ:** 31.05.18

వెబ్‌సైట్: http://nitkkr.ac.in/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం **www.eenadupratibha.net** చూడవచ్చు.

పదోతరగతి అరతతో ఆరేళ్ల బీటెక్

ఇంజినీరింగ్ లక్ష్యంగా ఉన్న విద్యార్థులు పదోతరగతి పూర్తికాగానే ఆ దిశగా అడుగులు వేయవచ్చు. ఆర్‌జీయూకేటీలు అందుకు అవకాశం కల్పిస్తున్నాయి. సాంకేతిక విద్యతోపాటు సాఫ్ట్‌స్కిల్స్, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ఈ సంస్థల ప్రత్యేకత.

తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ యువతకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించే లక్ష్యంతో రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ)లను ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయి. తెలంగాణలో ఒకటి బాసరలో, ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలుల్లో ఉన్నాయి. ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ)ని ప్రధానంగా బోధనలో వినియోగించడం ఈ కేంద్రాల ప్రత్యేకత. పదోతరగతి తర్వాత ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్‌లోకి 2018-19 విద్యాసంవత్సరం ప్రవేశానికి నోటిఫికేషన్లు వెలువడ్డాయి. ఏపీలోని నాలుగు ఆర్‌జేయూకేటీలకు ఒకే దరఖాస్తు పంపవచ్చు. తెలంగాణ బాసరలోని కేంద్రానికి ప్రత్యేకంగా అప్లై చేయాలి.

తెలుగు రాష్ట్రాల ఆర్‌జీయూకేటీల్లోకి ప్రవేశ ప్రకటన విడుదల

అర్హతలు

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని అభ్యర్థులు 2018లో పదో తరగతి లేదా తత్సమాన పరీక్ష పాసై ఉండాలి. ఈ సంవత్సరం డిసెంబరు 31 నాటికి సాధారణ అభ్యర్థులకు 18; ఎస్సీ, ఎస్టీలకు 21 సంవత్సరాల వయసు నిండి ఉండకూడదు.

దరఖాస్తు విధానం

అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో (ఏపీ ఆన్‌లైన్, టీఎస్ ఆన్‌లైన్) పంపాలి. సంబంధిత కేంద్రాల్లో నిర్ణీత దరఖాస్తు రుసుములు చెల్లించాలి. ఒకటి కంటే ఎక్కువ అప్లికేషన్లు పంపితే చివరగా చేరిన దాన్ని పరిగణనలోకి తీసుకుంటారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత ఒక ప్రింట్ అవుట్ తీసుకొని దానికి ఫీజు రసీదు, ఇతర సర్టిఫికెట్ల కాపీలను జతచేసి నోటిఫికేషన్‌లో ఇచ్చిన చిరునామాకు పంపాలి. తెలంగాణలో అందరూ ప్రింట్‌అవుట్‌లు పంపాల్సి ఉంటుంది. ఏపీ అభ్యర్థుల్లో కేవలం ప్రత్యేక కేటగిరీ (పీహెచ్/సీఏపీ/ఎన్‌సీసీ/స్పోర్ట్స్) వారు పంపితే సరిపోతుంది. మిగతా వాళ్లు ప్రింట్‌అవుట్ పోస్టు చేయాల్సిన అవసరం లేదు.

ఏపీ విద్యార్థులు నాలుగు ఆర్‌జీయూకేటీలకు ఒకే దరఖాస్తు పంపాలి. అందులో ఆ నాలుగు కేంద్రాలకు తమ ప్రాధాన్యాలను గుర్తించాలి.

ఎంపిక తీరు

పదో తరగతిలో సాధించిన గ్రేడ్ పాయింట్ ఏవరేజ్ (జీపీఏ) మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. ఒకే జీపీఏ ఉన్నవారికి సబ్జెక్టులవారీగా జీపీఏని పరిగణలోకి తీసుకొని ఎంపిక చేస్తారు. నాన్-రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వారు సాధించిన జీపీఏకి అదనంగా 0.4 డిప్రివేషన్ స్కోరు కలిపి మెరిట్ లెక్కిస్తారు.

ఫీజు వివరాలు

ఆరేళ్ల కోర్సుకుగానూ మొదటి రెండేళ్ల వరకు ఏడాదికి తెలంగాణలో రూ.37 వేలు, ఏపీలో రూ.36 వేలు ఫీజు కట్టాలి. తర్వాత నాలుగు సంవత్సరాల బీటెక్‌కు ఏడాదికి రూ. 40 వేలు ఫీజు చెల్లించాలి.

ఏపీ, తెలంగాణ విద్యార్థులు కాకుండా ఇతర రాష్ట్రాల విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోని సంస్థల్లో చేరాలంటే రూ. 1,36,000 ఫీజు చెల్లించాలి. అదే తెలంగాణలో అయితే రూ. 1.37,000 కట్టాలి. ఎన్ఆర్ఐలకు ఏపీలో రూ. 3,00,000; తెలంగాణలో రూ. 3,01,000 ఫీజుగా నిర్ణయించారు.

స్థానికత ఆధారంగా సీట్లు

ఏపీలోని ప్రతి ఆర్‌జీయూకేటీ పరిధిలో కొన్ని జిల్లాలు ఉన్నాయి. దాని ప్రకారం ఆయా జిల్లాల అభ్యర్థులకు 85 శాతం సీట్లు కేటాయిస్తారు. మిగతా 15 శాతం ఓపెన్ కేటగిరీలో భర్తీ చేస్తారు. తెలంగాణ బాసర కేంద్రంలో 85 శాతం సీట్లను తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు ఇస్తారు. మిగతా 15 శాతం ఓపెన్‌లో మంజూరు చేస్తారు.

ముఖ్యమైన తేదీలు

తెలంగాణ

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 01-06-2018.
ప్రింట్ అవుట్‌లు పంపడానికి చివరి తేదీ: 04-06-2018.
సెలక్షన్ జాబితా విడుదల: 11-06-2018.
తరగతులు ప్రారంభం: 03-07-2018.
వెబ్‌సైట్: www.rgukt.ac.in/

ఆంధ్రప్రదేశ్

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 08-06-2018.
ప్రత్యేక కేటగిరీల వారు ప్రింట్ అవుట్‌లు పంపడానికి చివరి తేదీ: 11-06-2018.
సెలక్షన్ జాబితా విడుదల: 16-07-2018.
తరగతులు ప్రారంభం: 01-08-2018.
వెబ్‌సైట్: www.rgukt.in/